



# Voice of Jagadguru

advaitam paramanandam

an e-magazine on advaita



## Sharan Navratri Special - Sri Chakra Upasana

## Jagadguru Vani

### అనుగ్రహ భాషణం - శ్రీ చక్ర ఉపాసన

పరమాత్మ, ప్రకృతి (శక్తి) సహాయంతో ఈ ప్రపంచాన్ని సృష్టించినాడు. శ్వేతాశ్వతర ఉపనిషత్తు దీనిని గురించి చెబుతూ, కిం కారణం బ్రహ్మ? "ఈ విశ్వానికి కారణం ఏమిటి? బ్రహ్మమా?" అని ప్రశ్నిస్తుంది. ఈ మహా సృష్టికి కారణం ఏమిటి? ఎక్కడ నుంచి ఎందుకు మనం జన్మించాము? దేనివల్ల మనం జీవిస్తున్నాము? తుదకు మన విశ్రాంతి స్థలం ఎక్కడ? మన సుఖదుఃఖాలన్నీ ఎవరివల్ల, దేనివల్ల నిర్ణయం అవుతున్నాయి? ఏ శాసనాలు మనల్ని నడుపుతున్నాయి? పరబ్రహ్మ అంటే ఏమిటి? ఉపనిషత్తు ఏమి సమాధానం ఇస్తుందంటే ?



తే ధ్యానయోగానుగతా అపశ్యన్ దేవాత్మశక్తి స్వగుణైర్నిగూఢాం ।

పరం బ్రహ్మం తన ఆత్మ శక్తితో ఈ విశ్వాన్ని రచించినది అని దీని అర్థం. శంకర భగవత్పాదులు, సూత్ర భాష్యంలో ఈ విషయం గురించి ప్రస్తావిస్తూ, ఇదే విషయాన్ని ప్రకటించినారు. పారమేశ్వర్యా: శక్తే: సమస్త జగద్విధాయిన్యా:.


పరంపరానుగతంగా మనకు అందజేయబడిన సంప్రదాయంలో శక్తికి అనేక పేర్లు వున్నాయి. పర దేవత ని పూజించడంలో, శ్రీ చక్రం చాలా విశిష్టమైనది. ఎలాగైతే సాలిగ్రామం (గుండ్రని రాయి) లో విష్ణువు శక్తి నిక్షిప్తమై వుంటుందో, అలాగే శ్రీ చక్రం లో పర దేవత నివసిస్తూ వుంటుంది. అందుచేత శ్రీ లలితా సహస్రనామం లో "శ్రీచక్రరాజనిలయ" అని స్పష్టంగా వశిన్యాది దేవతలు కొనియాడినారు.

భగవత్పాద శంకరులు సహజంగా వేదాంత జ్ఞానం, తత్వజ్ఞానం, అద్వైత సిద్ధాంతమును గురించి బోధించినారు. కానీ లౌకిక విషయాలలో పరదేవత అనుగ్రహం పొందాలంటే శ్రీచక్రాన్ని పూజించడం తప్పనిసరి అని అన్నారు. భావనోపనిషత్తు వంటి గొప్ప రచనలు శ్రీ చక్ర ఉపాసన గురించి అత్భుతంగా వివరించినాయి. సద్గురువు వద్ద శ్రీచక్రార్చన నేర్చుకుంటే అత్యుత్తమ ఫలితము వుంటుంది మరియు పూజను ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చేస్తే, అది జ్ఞానానికి, మోక్షానికి దారి తీస్తుంది. సర్వం శ్రీ గురుచరణారవిందార్పణమస్తు...

జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం,, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.

తెలుగు అనువాదము, రచన - శ్రీ భాస్కరానంద నాథ


We submit our efforts at the Lotus feet of Jagadguru Śankarācārya His Holiness Mahāsannidhānam Śrī Śrī Śrī Bhāratī Tīrtha Mahāswāmiji and Jagadguru Śankarācārya His Holiness Sannidhānam Śrī Śrī Śrī Vidhuśekhara Bhāratī Mahāswāmiji



# Voice of Jagadguru

advaitam paramanandam

an e-magazine on advaita




## Sri Chakra శ్రీ చక్రము



మన అందరికీ తెలుసు “శ్రీచక్రము” అత్యంత శక్తివంతమైన యంత్రము అని. ఒక వ్యక్తి శ్రీ చక్ర పూజ చేయడానికి స్వయంగా అర్హత కలిగి ఉండాలి. ఆ అర్హత మనకు దేవీ ఉపాసన ద్వారా లభిస్తుంది. సాధకుడు శ్రీ చక్ర పూజను నిర్వహించడానికి తన గురువు నుండి సరైన ఉపదేశాన్ని పొందాలి. శక్తి ఉపాసనలో (దేవి ఆరాధన) శ్రీ చక్ర పూజ కీలక పాత్ర పోషిస్తుంది. మంత్రాలలో "శ్రీ విద్య" మరియు యంత్రాలలో "శ్రీ చక్రం" అగ్రస్థానం. సిద్ధి పొందటానికి మంత్ర, యంత్ర ఉపాసన తప్పనిసరి.


సనాతన ధర్మం కనుమరుగుచున్న కాలంలో, జగద్గురువులు శ్రీ ఆదిశంకరాచార్యులు శ్రీ చక్ర పూజను ప్రముఖమైనదిగా చేశారు. శృతి, స్మృతుల నుండి అన్ని సంప్రదాయ ఆచార వ్యవహార అంశములను తిరిగి తీసుకుని వచ్చారు. వేదముల లోని స్వచ్ఛమైన ఫలాలను మనకు అందించినారు. శ్రీ ఆదిశంకరాచార్యులు నాలుగు దిక్కులలో నాలుగు పీఠాలను స్థాపించినారు. దానితో పాటు అనేక శక్తి పీఠాలలో శ్రీ చక్రాన్ని కూడా స్థాపించినారు. మొదటి శ్రీచక్రాన్ని శృంగేరిలో వారు స్థాపించినారు.

ఆ విధముగా మన జగద్గురువులు బ్రహ్మ విద్యా తత్త్వాన్ని శ్రీ చక్ర పూజ ద్వారా అందరికీ వ్యాప్తి చేస్తున్నారు. జగద్గురువులు వారి స్వంత ప్రయోజనం కోసం కాకుండా, ఈ శ్రీ చక్ర పూజను విశ్వ శాంతి కోసం చేస్తున్నారు. బ్రహ్మ విద్యా తత్త్వం అంటే జగన్మాత పరాశక్తి తప్ప మరొకటి కాదు. దక్షిణామూర్తి యొక్క గురు పరంపర లో జగద్గురువులు ఉన్నారు. దక్షిణామూర్తి అంటే పరమేశ్వరుడు తప్ప మరెవరో కాదు మరియు అతను మాయా శక్తి అయిన లలితా పరమేశ్వరి తో కూడి ఈ విశ్వ కార్యం చేస్తున్నాడు. తైత్తిరీయ ఉపనిషత్తు ఏమని చెప్పినదంటే ....

यतो वा इमानि भूतानि जायन्ते। येन जातानि जीवन्ति । यत्प्रयन्त्यभिसंविशन्ति । तद्विजिज्ञासस्व तद्ब्रह्मेति । (भृगुवल्ली)

"జగత్తు బ్రహ్మం నుండి ఉద్భవించింది, బ్రహ్మం ద్వారా ఉనికిలో ఉంది మరియు ప్రళయ కాలంలో బ్రహ్మంలో కలిసిపోతుంది". మాయాశక్తి ద్వారా పర బ్రహ్మం సృష్టి రచన చేయుచున్నాడు మరియు ఆ మాయాశక్తి నే పరాశక్తి అని పిలుస్తారు. పరాశక్తి నుంచి బ్రహ్మమును, బ్రహ్మము నుంచి పరాశక్తి ని వేరు చేయలేము అనేది సత్యం. అర్ధనారీశ్వర ఆరాధన ద్వారా మనం ఈ సత్యాన్ని గ్రహించగలం.

సౌందర్యలహరిలో


- SHRÎ CHAKRA -

శరీరం త్వం శంభో: శశిమిహిరవక్షోరుహయుగం

తవాత్మానం మన్యే భగవతి నవాత్మమానఘమ్.

అత: శేష: శేషీత్యయముభయసాధారణతయా

స్థిత: సంబంధో వాం సమరసపరానన్దపరయో: ॥

"ఓ దేవీ! నీవు పరమాత్ముని (శంభు) యొక్క శరీరము. సూర్యుడు మరియు చంద్రుడు నీ స్తనములు. పరమాత్మ మీ శరీరం. మీ ఇద్దరిలో పూర్ణత్వం యొక్క లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి మీరిద్దరూ ఒక్కటే". 'జగత్తు" అనేది మాయాశక్తి సహాయంతో ఏర్పడుతోందని మనం అర్థం చేసుకున్నాము. దీనిసే మనం వివేకచూడామణిలో కూడా చూడవచ్చును.

అవ్యక్తనామ్నీ పరమోరాశక్తిరనాద్యవిద్యా త్రిగుణాత్మికా పరా ।

కార్యానుమేయా సుధియైవ మాయా యయా జగత్సర్వమిదం ప్రసూయతే ॥

మాయ నుండి ఎలా బయటపడాలి? మనం అజ్ఞానాన్ని పోగొట్టుకొని, తత్త్వ జ్ఞానాన్ని ఎలా పొందాలి? పరాశక్తి మాయా రూపిణి అయితే, అప్పుడు ఆమెను పూజించడం ద్వారా ఆత్మజ్ఞానం మనకు ఎలా లభిస్తుంది? మన మదిలో మెదులుతున్న ప్రశ్నలు ఇవే ఇప్పుడు. ఆమె ఒక్క మాయను సృష్టించిన మాయా మోహిని యే కాదు. ఆమె యే ఇచ్ఛా శక్తి, క్రియా శక్తి మరియు జ్ఞాన శక్తి. పరమాత్మ స్వరూపమైన (బ్రహ్మ) 'సత్, చిత్, ఆనంద్' మే పరాశక్తి తప్ప మరెవరో కాదు. కేనో ఉపనిషత్తు ఏమని చెప్పిందంటే ....

"విద్యా ఉమారూపిణీ ప్రాదురాసీత్ స్త్రీరూపా సా బ్రహ్మేతి హోవాచ."

"బ్రహ్మ విద్య" యే స్త్రీ రూపంలో పరాశక్తిగా అవతరించింది".

తల్లి అయిన పరాశక్తి యొక్క అనుగ్రహాన్ని దేనితోనూ పోల్చలేము.

సౌందర్య లహరి 22వ శ్లోకంలో భగవత్పాదులు శ్రీ ఆదిశంకరాచార్యుల వారు ఏమన్నారంటే ....

భవానీం త్వం దాసే మయి వితర దృష్టిం సకరుణామ్

ఇతి స్తోతుం వాఞ్ఛన్ కథయతి భవాని త్వం ఇతి య: ।

తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్యపదవీమ్

ముకుంద బ్రహ్మేంద్ర స్ఫుట మకుట నీరాజిత పదామ్ ॥౨౨॥

అమ్మా భవానీ ! నేను నీ దాసుణ్ణి అమ్మా, నీ కృపా కటాక్ష వీక్షణాలు  నాపై ప్రసరింపజేయుము అమ్మా అని ఉపాసకుడు ప్రార్థించినంతనే, అతడికి, ముకుందబ్రహ్మేంద్రులు తమ రత్నకిరీటాలతో  నమస్కరించే నీ పాదపద్మముల యొక్క సాయుజ్యాన్ని కల్పిస్తున్నావు. ఇది మనం 'భవానీ త్వం' అనే పదం నుండి పొందవచ్చు.



మాయ నుంచి  బయటపడి ముక్తిని పొందాలంటే జగన్మాత యొక్క పాద పద్మములకు శరణాగతి చేయాలి. ఆమె మాత్రమే మనకు ముక్తిని పొందడానికి సరైన మార్గాన్ని చూపుతుంది.,  సరైన గురూపదేశము లేకుండా, నిర్గుణ పరబ్రహ్మం యొక్క ఆరాధన అనూహ్యమైనది. నిర్గుణ ఆరాధన యొక్క స్థితి ని పొందడం కోసం మనకు అనేక సగుణ పూజలు (విగ్రహం మరియు యంత్రం) ఇవ్వబడ్డాయి. శక్తి ఉపాసన అత్యున్నతమైనదిగా పరిగణించబడుతుంది మరియు ఆమె యంత్రాలు మరింత  శక్తివంతమైనవి, అవి పరబ్రహ్మం తప్పించి మరొకటి కావు. ఆమె తన భక్తులకు భౌతిక వాంఛలు నెరవేర్చి, నెమ్మదిగా విముక్తి వైపు నడిపించి (సంసార సాగర బంధం నుండి) భోగ, మోక్ష ఫలముల రెండింటినీ ప్రసాదిస్తుంది. మన పరిమిత జ్ఞానంతో ఆమె స్వరూపాన్ని, శక్తిని మనం భావించలేము, అంచనా వేయలేము.


శ్రీ చక్రం లోని రేఖలు, వృత్తాలు మరియు అక్షరాలు గొప్ప శక్తిని కలిగి ఉంటాయి. అవి విశ్వం నుండి శక్తిని ఆకర్షించి తిరిగి ప్రతిబింబిస్తాయి. సూర్య కిరణాలను ఓడిసిపట్టి, భూత అద్దము ద్వారా కాగితాన్ని కాల్చడం అనే ప్రక్రియ  నిరూపించ బడినది. అదే విధముగా ఈ చక్రాలు (యంత్రాలు)  దైవ శక్తిని ఆకర్షించి, అత్యంత శక్తివంతమైన రీతిలో తిరిగి  ఆ శక్తిని ప్రతిబింబిస్తాయి. అటువంటి యంత్రాలు చాలా ఉన్నాయి. ఒక్కో దేవతకు ఒక్కో యంత్రం చొప్పున మనకు రకరకాల యంత్రాలు ఉన్నాయి. ఒక్క అమ్మవారికే సౌందర్యలహరిలో ఒక్కొక్క శ్లోకానికి ఒక్కొక్కటి చొప్పున 100 యంత్రాలు ఉన్నాయి. అన్ని యంత్రాలలో ఈ  "శ్రీ చక్రం" సర్వోన్నతమైనదిగా పరిగణించబడుతుంది. భువనేశ్వరి మాత సమస్త విశ్వానికి అధిపతి కాబట్టి, ఆమె శ్రీచక్రం అత్యున్నతమైన యంత్రంగా విరాజిల్లు చున్నది. ఈ ప్రపంచంలో ఆమెయే సర్వస్వం, ఆమె లేకుండా ఏ పనీ జరగదు. ఈ విషయాలను మచ్చుకకు కొన్నింటిని మనం ఈ కథనంలో చూడవచ్చును. లలితా సహస్రనామములలో "శ్రీచక్రరాజనిలయ, శ్రీమత్రిపురసుందరి, శ్రీశివ, శివశక్త్యైక్యరూపిణి". లలితా సహస్రనామానికి భాష్యం చెప్పిన మహానుభావుడు శ్రీ భాస్కరరాయలు,  శివుడు మరియు శక్తి ఒకటేనని, వారి స్థానం శ్రీచక్రమని, అక్కడ వారిని కామకామేశ్వరీ రూపంలో పూజిస్తున్నామని మరియు ఆమె తన భర్త శంభునితో  కలిసి ఈ విశ్వానికి అధిపతి అని, సామ్రాజ్ఞి అని అతి  సుందరంగా వివరించినారు... లలిత త్రిశతిలో శ్రీ హయగ్రీవుడు శ్రీ చక్ర పూజ యొక్క గొప్పతనం గురించి ఫల శ్రుతిలో వివరిస్తారు.

बिन्दुत्रिकोणवसुकोणदशारयुग्ममन्वश्रनागदलषोडशपत्नयुक्तम्। वृत्तत्रयं च धरणीसदनत्रयं च श्रीचक्रराज उदितं परदेवतायाः॥

"మూడు రేఖల చతుర్భుజం (భూపుర), 16-రేకుల కమలం (షోడశ దళ పద్మం), తదుపరి ఆవరణం 8-రేకుల కమలం (అష్టదళ పద్మం), 14 త్రిభుజాల చక్రం (చతుర్దశ), 10 బయటి త్రిభుజం, 10 లోపలి త్రిభుజం, 8 త్రిభుజం, ఒక లోపలి త్రిభుజం (త్రికోణ) మరియు మధ్యస్థ బిందు."

శ్రీ చక్రము వివిధ రకములుగా, వివిధ రూపములలో పూజింపబడుచున్నది. మేరు రూపంలో ఉన్న యంత్రాలను వెండి, బంగారం, ఇత్తడి, రాగి, పంచ లోహములతో తయారు చేస్తారు. మరియు రకరకాల రంగు ముగ్గు రాళ్ళతో, పిండితో, పసుపుతో నేల మీద చిత్రీకరిస్తారు.  సౌందర్య లహరిలోని 11వ శ్లోకం శ్రీ చక్రము యొక్క ప్రత్యేకతను తెలుపుతుంది. బాహ్య

శ్రీ చక్ర పూజ కన్నా, శివ శక్తి ఐక్యం చెందిన కుండలినీ శక్తిని, మన లోపలి ఆరు చక్రముల ద్వారా ఉత్తేజితబరచి, సౌందర్యలహరి లో చెప్పబడినట్లుగా సాధన చేయగలిగితే ముక్తిని పొందుతాము.




దశ మహావిద్యలలోని ఐదవ విద్య, పదవ విద్య అయిన త్రిపుర భైరవి, కమలాత్మికను లలితా పరమేశ్వరి గా మరియు ఆమెయే కామేశ్వరిగా మనం అర్థం చేసుకోగలుగుతున్నాం. ఈ మూలం మనకు "శారదా తిలకం" నుండి లభిస్తుంది. పవిత్రమైన శ్రీ చక్ర పూజను నిర్వహించడానికి శ్రీ విద్యా ఉపాసకులు మాత్రమే అర్హులు. శ్రీ చక్రానికి చేసే నవావరణ పూజ చాలా ఉత్కృష్టమైనదిగా పరిగణించబడుతుంది. విభిన్న యంత్రములతో, చిన్ముద్రలతో, మంత్రములతో, హారతులతో ఒక్కో ఆవరణను పూజించే సంప్రదాయ రహస్యాన్ని కలిగి ఉంటుంది ఈ శ్రీ చక్ర పూజ. దీనిని ఉపాసకులు తమ గురువుల నుంచి నేర్చుకొని, ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలి.


శ్రీ చక్రం యొక్క ప్రాముఖ్యతను మరియు దాని ప్రయోజనములను గురించి వివిధ పురాణములలో మనం చూడవచ్చును. రామాయణం (నవరాత్రి పూజలు చేయమని రామునికి నారదుల వారి సలహా), మహాభారతం (యుద్ధంలో గెలవడానికి అర్జుడ్ని నవరాత్రి పూజను చేయమని ప్రేరేపించిన శ్రీకృష్ణుడు), శ్రీమద్దేవీ భాగవతం, దుర్వాసుని లలితా స్తవరత్నం, లలిత శోభన, దేవీ మహాత్మ్యం, లలితా సహస్రనామం, లలితా త్రిశతి, దశ మహా విద్య, లలితోపాఖ్యానం మొదలగు గ్రంథాలు శ్రీ చక్రం మరియు కామ కామేశ్వరి యొక్క రాజభవనం అయిన చింతామణి గృహం (శ్రీ పురం) గురించి కూడా వివరిస్తాయి. ఇక్కడ మనం సౌందర్యలహరి మరియు శ్రీ లలితా స్తవరత్నం నుండి శ్రీ చక్ర మరియు శ్రీ పుర వర్ణనను తిలకించబోతున్నాము. సౌందర్యలహరి కోసం మనం లక్ష్మీధరుని యొక్క వాఖ్య అయిన సౌభాగ్యవర్ధనీ, అరుణామోదినీ, మరియు సుబ్రమణ్య శాస్త్రిగారి 'శ్రీ చక్ర' వ్యాఖ్య మనం ఆలకించబోతున్నాము.

చతుర్భి: శ్రీకణ్ఠై: శివయువతిభి: పఞ్చభిరపి

ప్రభిన్నాభి: శంభోర్నవభిరపి మూలప్రకృతిభి: ।

చతుశ్చత్వారింశద్వాసుదలకలాశ్ర త్రివలయ

త్రిరేఖాభి: సార్ధం తవ శరణకోణాః పరిణతాః ॥



Four triangles pointing up. | Five triangles pointing down | Central figure | Complete Sri Yantra

నాలుగు శివ త్రిభుజాలు ఊర్ధ్వ ముఖ దిశలో, ఐదు శక్తి త్రిభుజాలు అధో ముఖ దిశలో, 9 మూల స్తంభాలు, చక్కగా అకృతిలో అమర్చబడిన 44 త్రిభుజాలతో పాటు 16 రేకుల తామర పువ్వు, 8 రేకుల తామర పువ్వుతో పాటు మూడు వలయాలతో కప్పబడి, నాలుగు వైపులా ఏర్పడిన మూడు రేఖలతో కోటగా కప్పబడి ఉంటుంది. శ్రీ చక్రం కోసం మనం శ్రీ

లలితా సహస్రనామ నామాలను పరిశీలించాలి. చక్రరాజనికేతనా । త్రికోణాన్తరదీపికా । త్రికోణగా । శ్రీచక్రరాజనిలయా । శ్రీ చక్రంలో మనం తొమ్మిది యోనులను చూడగలుగుతున్నాము. కామ కలాపం వివరణ ఈ క్రింది విధంగా ఉన్నది.

త్వగస్సృక్ మాంసమేదోస్థి ధాతవ: శక్తిమూలకాః ।

మజ్జాశుక్లప్రాణజీవ ధాతవశ్శివ మూలకాః ॥

నవధాతు రాయందేహః నవయోనిసముద్భవః ।

దశమో ధాతురేకైవ పరాశక్తి: తదీశ్వరీ ॥

మన శరీరంలోని తొమ్మిది యోనులు అనగా తొమ్మిది కోణాలు, 9 ధాతువులు అవి చర్మం, రక్తం, కణజాలం, కొవ్వు మరియు ఎముకలు ఈ ఐదు శక్తి మూలకాలు. మజ్జ , శుక్ల, ప్రాణ మరియు జీవ ఈ నాలుగు శివ మూలకాలు. పదవ స్థానం బిందు అని పిలువబడే మధ్య బిందువు. బైన్దవ స్థానము. శరీరమే శ్రీచక్రం కనుక మన హృదయంలో బిందువు అయిన లలితా పరమేశ్వరిని ధ్యానించాలి. ఐదు భూతాలను (పృథ్వీ, నీరు, ఆకాశ, వాయు మరియు అగ్ని) శక్తి తత్త్వం మరియు మాయ, శుద్ధ విద్యా, ఈశ్వర మరియు సదాశివుడిని శివ తత్త్వం అంటారు. బ్రహ్మాండము, పిండాడము రెండూ శ్రీ చక్రంలో కనిపిస్తాయి. శ్రీ చక్ర పూజ చేస్తున్నప్పుడు, సృష్టి, స్థితి మరియు సంహారం (ఉపసంహారణ), తిరోధానం మరియు అనుగ్రహం – తిరిగి సృష్టి కార్యం శ్రీ చక్రంలో ఉందని భావన చేయాలి. ఆరోహణ, అవరోహణ రెండు రకాల పూజ ఉన్నది.

శివశక్త్యాత్మకం విద్ధి జగదేతచ్చరాచరమ్ ।

ఈ ప్రపంచం లో అంతా శివుడు, శక్తి అని పై వాక్యం నిర్వచిస్తుంది. ఈ భావన ద్వారానే మనం పూజ చేయాలి. కొన్ని చోట్ల 51 తత్వాలు ఉన్నట్లు మనం చూడగలుగుతున్నాం. అవి పంచ మహా భూతాలు {భూమి, నీరు, వాయువు, అగ్ని మరియు ఆకాశం}(5); శబ్ద, స్పర్శ, రూప, రసం మరియు గంధం} పంచ తన్మాత్రలు. జ్ఞానేంద్రియాలు (5) { చెవి, చర్మం, కన్ను, నాలుక మరియు ముక్కు}; కర్మేంద్రియాలు (5) (ఇంద్రియ క్రియలు) { నోరు, చేతులు, కాళ్ళు, విసర్జన అవయవాలు మరియు పునరుత్పత్తి అవయవం};

మూలకాలు (7) { చర్మం, రక్తం, కణజాలాలు, కొవ్వులు, ఎముకలు, మజ్జ మరియు శుక్లము}; పంచ ప్రాణములు (5) { ప్రాణము, అపాన, సమాన, వ్యానము మరియు ఉదాన}; “అంతఃకరణం” (4) మనస్సు; బుద్ధి; చిత్తం; అహంకార(4) వీటిని ‘అంతఃకరణం” అంటారు;



గుణములు 3 { సత్వ, రాజస మరియు తమో గుణములు}; ప్రకృతి (1); పురుషుడు- జీవుడు (1); రాగం - కోరిక (1); విద్య – జ్ఞాన (1) ; 360 కళలు (1) ; నీతి - ధర్మం చేయడం (1); కాలము - కాలము (1) ; మాయ - భ్రమ (1) ; శుద్ధ విద్య - మోక్షం (1); ఈశ్వరుడు - సృష్టికి కారకుడు (1) ;

సదా శివుడు (1) – సృష్టి, స్థితి రెండింటినీ చేస్తున్నాడు. శక్తి (1) - ఈశ్వరుడు, సదాశివుడు రెండింటి యొక్క శక్తి.

ఈ 51 తత్వాలు శ్రీచక్ర త్రిభుజాల లోపల ఉన్నాయి. ఐదు శివ మరియు నాలుగు శక్తి తత్వాల కలయిక అయిన శ్రీ చక్రం ఈ ప్రపంచ సృష్టిని ప్రతిబింబిస్తుందని పైన పేర్కొన్న విషయాలు ఆధారంగా మనం స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతున్నాము, దీని ద్వారా సృష్టి, స్థితి, లయములు జరుగు చున్నవి.

चतुश्चत्वारिंशत चतुశ్చత్వారింశత

పైన చెప్పిన వాక్యం నుండి చూస్తే శ్రీ చక్రానికి 44 త్రిభుజాలు ఉన్నాయి అని అర్థమౌతుంది. అదేవిధముగా ఈ క్రింది పంక్తి కూడా "వసుదలకలాశ్ర త్రివలయ త్రిరేఖాభిః" అని తెలుపుతుంది. వసు అంటే 8 త్రిభుజాలు (కోణాలు), కలాచారం అంటే 16 త్రిభుజాలు (కోణాలు), త్రివలయం అంటే 3 వృత్తాలు, త్రిరేఖ అంటే నాలుగు వైపులా ద్వారములా, ఖాళీతో మధ్యలో మూడు రేఖలు (గీతలు)...

బిందు త్రికోణ వసుకోణ దశారయుగ్మం,

మన్వశ్ర నాగదళ సంయుత షోడశారం,

వృత్తత్రయం చ ధరణీ సదన త్రయం చ

శ్రీచక్రమేతత్ ఉదితం పరదేవతాయాః ||

44 త్రిభుజాలు 8 రేకుల కమలం, 16 రేకుల కమలం మరియు ఈ త్రిభుజాల చుట్టూ మూడు వృత్తాలు మరియు తామర రేకులు మరియు చివరగా మూడు రేఖల కోటలు బయటి రూపాలు శ్రీ చక్రం. శ్రీ చక్రంలో 24 మధ్య బిందువులతో 28 రహస్య ప్రదేశాలు ఉన్నాయి, వీటిని సంధి అంటారు. రెండు రేఖలు కలిసే బిందువును సంధి అంటారు. మూడు రేఖలు కలిసే బిందువును 'గ్రంథి" అంటారు. శివచక్రాలైన అష్టదళాలు, షోడశ దళాలు, వృత్తాలు, భూపురము మూడు రేఖల కలయిక లేనప్పటికీ దీనిని రహస్య ప్రదేశం అంటారు. శ్రీ ఆదిశంకరాచార్యుల యొక్క ఈ క్రింది ప్రతిపాదన ప్రకారం మనం శ్రీ చక్రం యొక్క రూపం గురించి తెలుసుకోగలుగుతాము. చతుశ్చత్వారింశత్ తవచరణకోణాః పరిణతాః

శ్రీ చక్రం గురించి శ్రుతి ఇలా చెప్పింది. "సతద్వాప్తారగమంతా సంహార్యం" . శ్రీచక్రము మూడు రకములుగా లోకములో పూజింప బడుచున్నది, అవి మేరు ప్రస్తారము, కైలాస ప్రస్తారము మరియు భూ ప్రస్తారము. శ్రీ చక్రార్చన లో వినియోగించే మంత్రం ను బట్టి భేదమును గమనించవచ్చును.



16 నిత్య దేవతల (షోడశాక్షరీ మంత్ర స్వరూపం) యొక్క పూజ యే శ్రీ చక్రం యొక్క మేరు రూపం. మాతృకా దేవి పూజ తో కూడినది కైలాస ప్రస్తార శ్రీ చక్ర పూజ మరియు వశిన్యాది దేవతా మంత్రములతో కూడిన పూజ యే భూ ప్రస్తార శ్రీ చక్ర పూజ.

16 చంద్ర కళలు (తిథి), 27 నక్షత్రములు కలిసి శ్రీ చక్రంలో 43 త్రిభుజములు ఏర్పడినాయి. 12 కళలు, 12 మూర్తులు, 12 రాశులు, 3 వేదములు, 4 స్వరములు కలిసి 43 త్రిభుజములు శ్రీ చక్రంలో సూర్యుని రూపంలో ఉంటాయి మరియు మధ్య లో వున్న త్రిభుజం తేజస్సు అని అంటారు. అగ్ని యొక్క అష్ట మూర్తులు జాతవేద, సప్తజిహ్వ, హవ్యవాహన, కౌమారతేజ, అశ్వోదరాజ, వైశ్వానర, విశ్వముఖ, దేవముఖ ఈ అష్ట కోణములు లో గలవు.

దూమ్రార్చి, ఉష్మా, జ్వలినీ, జ్వాలినీ, విస్ఫులింగినీ, సుశ్రీ, సురూపా, కపిల, హవ్య వాహినీ, కవ్య వాహినీ, అను ఈ పది అగ్ని కళలు 10 లోపలి త్రిభుజములు.


విరాట్, స్వరాట్, సామ్రాట్, అభిభు, సుభు, విభు, ప్రభ్వీ, ప్రభుతి, శివా, విభూతి ఈ 10 కోణములు శ్రీ చక్రంలోని బాహ్య త్రిభుజములు. సాత్విక, రాజస, తామస గుణముల కలయికలతో తదుపరి కోణములు ఏర్పడినవి. ఈ విధంగా నాలుగు ద్వార రేఖలతో మూడు వృత్తములతో, అష్ట దళ, షోడశ దళ పద్మములతో శ్రీచక్రము ఏర్పడుతుంది. తైత్తిరీయ సంహితలో

(1-5-11) రుతావానం కర్మణీమహే..... అను శ్లోకాలలో ఇది వివరించబడింది. ఈ విధంగా శ్రీ చక్రం గురించి, సౌభాగ్యవర్ధనీ మరొక కోణంలో విశదపరిచినది.

శ్రీ చక్రంలో తొమ్మిది రకాల దేవతలు ఉన్నారు. మనము శ్రీ చక్రానికి నవావరణ పూజలు చేస్తున్నాము. గమనించదగ్గ మరో విషయం ఏమిటంటే, కామేశ్వరునితో కలిసి ఉన్న లలితా పరమేశ్వరి యొక్క రాజభవనం అయిన చింతామణి గృహం ఈ శ్రీచక్రం తప్ప మరొకటి కాదు. మరియు జగన్మాత అయిన లలితా పరమేశ్వరి యొక్క ప్రధాన భవనం చుట్టూ 25 కోటలు, వాటి చుట్టూ సేనలు మరియు ప్రతి కోటకు ఒక సైన్యాధ్యక్షుడు ఉంటాడు. "శుద్ధ శక్తి మాలా" మంత్రములో శ్రీ చక్రంలోని తొమ్మిది ఆవర్ణ దేవతల గురించి చెప్పబడినది. శక్తి ఉపాసకులు ఈ శ్రీ చక్రంలో నవావర్ణ పూజలు చేస్తున్నారు. శ్రీ చక్ర బిందువులో ఉన్న శ్రీ మాత పరమేశ్వరి యే తొమ్మిదవ దేవత. ఇప్పుడు మనం నవావర్ణ దేవతలను చూస్తాము. ప్రకృతి, బీజ, ముద్ర మరియు న్యాసములను మొదలగు వాటిని గురు ముఖముగానే తెలుసుకోవాలి. కాబట్టి ఆ వివరములను ఇక్కడ పొందుపరచడం లేదు.

1.. భూపుర త్రయము (ఆకృతి); త్రైలోక్య మోహన (చక్రం); త్రిపుర దేవి (చక్రేశ్వరి); ప్రకట యోగిని (యోగిని); 10 అణిమాది దేవతలు, 8 మంది బ్రాహ్మీ మాతృకా దేవతలు, 10 ముద్రాశక్తులు సర్వసంక్షోభిణి. నవావర్ణం లో మొదటి ఆవరణ దేవతలు వీరు. అణిమ (సిద్ధి)

2. షోడశ దళము (ఆకృతి); సర్వశాపరిపూరక (చక్రం); త్రిపురేశి (చక్రేశ్వరి); గుప్త (యోగిని); కామాకర్షిణి నుండి 16 దేవతల వరకు; లఘిమ (సిద్ధి).



3. అష్ట దళము (ఆకృతి); సర్వసంక్షోభణ (చక్రం); త్రిపురసుందరి (చక్రేశ్వరి); గుప్తతర (యోగిని); అనంగ కుసుమ నుండి తదుపరి 8 దేవతల వరకు; మహిమ (సిద్ధి) .

4. 14 కోణాలు (త్రిభుజాలు) (ఆకృతి); సర్వ సౌభాగ్య దాయక (చక్రం); త్రిపురవాసిని (చక్రేశ్వరి); సంప్రదాయని (యోగిని); సర్వ సంక్షోభిణి నుండి తదుపరి 14 దేవతల వరకు; ఈశిత్వ (సిద్ధి).


5. బాహ్య త్రిభుజములు 10 (ఆకృతి); సర్వార్ధ సాధక చక్రం (చక్రం); త్రిపురాశ్రీ (చక్రేశ్వరి); కులోత్తీర్ణ (యోగిని); సర్వాసిద్ధిప్రదాదేవి నుండి 10 దేవతల వరకు; వశిత్వ (సిద్ధి).

6. లోపలి త్రిభుజములు 10 (ఆకృతి); సర్వరక్షాకార చక్రము (చక్రం); త్రిపుర మాలిని (చక్రేశ్వరి); నిగర్భ యోగిని (యోగిని); సర్వజ్ఞా దేవి నుండి వచ్చే 10 దేవతలు; ప్రాకామ్య (సిద్ధి).


7. త్రిభుజములు 8 (ఆకృతి); సర్వరోగహర చక్రము (చక్రం); త్రిపురా సిద్ధాంబ (చక్రేశ్వరి); రహస్య యోగిని (యోగిని); వశిని నుంచి మిగతా 8 దేవతలు; భుక్తి (సిద్ధి).

8. త్రికోణము (ఆకృతి); సర్వ సిద్ధిప్రద చక్రము (చక్రం); త్రిపురాంబ (చక్రేశ్వరి); అతిరహస్య (యోగిని); 4 ఆయుధములు, మహా కామేశ్వరి తర్వాతి దేవతలు; ఇచ్ఛా శక్తి (సిద్ధి).

9. బిందువు (ఆకృతి); సర్వానందమయ (చక్రం); మహా త్రిపురసుందరి సమస్త చక్రేశ్వరి (చక్రేశ్వరి); పరాపర అతిరహస్య యోగిని (యోగిని); మహా త్రిపురసుందరి తురియంబా (దేవత); ప్రాప్తి సర్వకామ (సిద్ధి) .


Voice of Jagadguru

advaitam paramanandam

an e-magazine on advaita



గొప్ప శ్రీవిద్యోపాసకుడు అయిన దుర్వాసో మహర్షి రచించిన ప్రసిద్ధ స్తోత్రము శ్రీ లలితా స్తవ రత్నం (ఆర్యా ద్విశతి), ఇది చింతామణి గృహం మరియు దాని చుట్టూ ఉన్న 25 కోటల అందాలను అక్కడ ఉన్న దేవతలతో బాటు సవివరంగా వివరిస్తుంది. ఇప్పుడు మనం దాని వర్ణన గురించి క్లుప్తంగా తెలుసుకుందాము.

ఇక్కడ మహర్షి దుర్వాసొ మహా ముని జగన్మాత అయిన శ్రీ లలిత పరమేశ్వరి యొక్క అంతఃపుర సౌధ అందాలను వర్ణించడానికి, అన్ని అడ్డంకులను తొలగించి, తనని అనుగ్రహించమని విఘ్న వినాయకుడు అయిన శ్రీ వల్లభ గణపతిని ప్రార్ధన చేస్తూ ఇలా మొదలు పెడుతున్నారు. మహర్షి మహా మేరువు కు నమస్కరిస్తున్నాడు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు మరియు రుద్ర నివాసాలు మహా మేరువు కు తూర్పు, నైరుతి మరియు వాయువ్య దిశలో ఉన్నాయి. దాదాపు 400 యోజనాలు విస్తీర్ణం గల 'చింతామణి' గృహము నకు "ఆది విద్య" అని మరొక పేరు కలదు. ఈ భవంతి చుట్టూ వున్న ఇతర కోటలను మనం ఇక్కడ చూడబోతున్నాం, మొదటి కోటలో మనం చూడబోయే కొలతలు మిగతా అన్ని కోటలకు వర్తిస్తాయి. 1400 యోజనాలు గల మొట్టమొదటి కోట 'ఇనుప కోట'. 'ఇనుప కోట' మరియు రెండవది అయిన 'ఘంటా కోట' (కంచు కోట) వీటి మధ్య 7 యోజనాల దూరం కలదు. ఈ రెండు ప్రాకారాల మధ్య ఒక అందమైన ఉద్యానవనము గలదు. నీలి రంగులో ఉన్న ఆ వన ప్రదేశానికి 'మహాకాళి' మరియు 'మహాకాళుడు క్షేత్ర పాలకులుగా వున్నారు.

మూడవ కోట 'తామ్ర' కోట. ఈ రెండు కోటల మధ్య ఎరుపు రంగులో గల 'కల్పక వృక్ష వనం' గలదు. ఆ 'కల్పక వృక్ష' ఉద్యానవనంలో 'మధుశ్రీ', 'మాధవశ్రీ' లతో పాటు 'వసంత ఋతువు' ఆనందోత్సాహాలతో రాజ్యమేలుతున్నది. చంద్రుడిలా తెల్లటి రంగులో మెరిసి పోతూ ఉండే 'నాల్గవ కోట' 'నికెల కోట' (సీసము). ఈ రెండు కోటల మధ్య గంధపు చెట్లతో నిండిన ఉద్యానవనం కలదు. 'గ్రీష్మ ఋతువు' వెచ్చదనం లో 'శుక్ర శ్రీ' మరియు 'శుక శ్రీ'లతో జగదంబ అయిన పరమేశ్వరి ఆస్వాదిస్తోంది. 'ఐదవ కోట' బంగారు పసుపు రంగులో ఉన్న ఇత్తడి కోట. ఈ ప్రదేశంలోని తోటలో కోకిల ఐదు రాగాలలో పాడుతోంది. 'నభ శ్రీ', 'నభస్య శ్రీ' లతో 'వర్ష రుతు' ఈ ప్రాంతాన్ని పాలిస్తోంది.



ఇత్తడి కోట నుండి 7 యోజనాల దూరంలో ఉన్న 'ఆరవ కోట' 'పంచలోహాల' (ఐదు రకాల మూలకాల కలయిక) చేత చేయబడింది. ఈ రెండు కోటల మధ్య ఉన్న వృక్ష వనము మందార వనము. ఇచ్చట 'ఈశ శ్రీ' మరియు 'ఊర్జ శ్రీ'లతో కలిసి 'శరద్ ఋతువు' పాలిస్తున్నాడు. 'ఏడవ కోట' 'వెండి కోట', ఇచ్చట పారిజాత వృక్ష వనము కలదు. 'సాహ శ్రీ' మరియు 'సహ్యశ్రీ' లతో కలిసి 'హేమంత ఋతువు' శోభిల్లుచున్నది.



ఎనిమిదవ కోట' వివిధ రకాల పొదలు, పూలతో కదంబ ఉద్యానవనం తో కూడిన 'బంగారు కోట'. లలితా పరమేశ్వరి మాత అనుగ్రహంతో ఈ ప్రాంతాన్ని 'తప శ్రీ', 'తపస్త శ్రీ'లతో పాటు 'శిశిర రుతు' పరిపాలిస్తోంది. ఈ 'కదంబవనం'లో 'మంత్రిణీ దేవి' మరియు ఇతర సప్త దేవతలు కూడా ఉన్నాయి. వారి రాజభవనం బంగారు మరియు ఇతర లోహాలతో విలువైన రాళ్లతో నిర్మించబడింది. ఆమె సింహాసనం (68+30) 98 అక్షరము లతో చక్రంలో ఉంది. ఆమె అందాన్ని వర్ణించాలంటే పదాలు వెతుక్కోవాల్సిందే. ఆమె చెవికి ఉన్న ఆభరణములు సాటిలేనివి. చిరునవ్వుతో ఎర్రబడిన ఆ పెదవుల అందం తాంబూల చర్వణము వల్లనే కాబోలు. ఎర్రటి కుంకుమపువ్వు శరీర రంగుతో, శిఖ లో చంద్రుడు మరియు తన భుజాల్లో

తులసి, కదంబ వన మాలలతో ఎర్రటి పాదాలతో ఆ తల్లి ధ్యానం లో మన మనసును ఎంతగానో ఆకట్టుకుంటుంది. భుజం మీద చిలుక, చేతిలో వీణ, అర్ధ నిమిలి నేత్రాలతో సగం కళ్లు మూసుకుని, సగం తెలుపు, ఎరుపు రంగులోని చీర కట్టుకొని వున్నది అమ్మ. ఇది ఆమె అన్ని శాస్త్రాలకు, వేదాలకు అధిపతి అని సూచిస్తుంది. 'సంగీత మాతృక' అని మరొక పేరుగల 'మంత్రిణీ దేవి' యొక్క పాద పద్మము లకు దుర్వాస మహర్షి నమస్కారములతో శరణాగతి చెందుతాడు.

'తొమ్మిదవ కోట' ' పుష్యరాగ కోట'. ఇక్కడ 'సిద్ధ పురుషులు' ఎల్లప్పుడూ శ్రీవిద్యను ధ్యానం చేస్తూ ఆనందంతో జీవిస్తూ వుంటారు. పదవ కోట 'పద్మ రాగ కోట'. ఎవరైతే తమ మనస్సు నుంచి, బుద్ధి నుంచి అధర్మాన్ని ఎవరు నిర్మూలిస్తారో అటువంటి గొప్ప అమ్మ భక్తులు ఈ 9వ, 10 వ కోటల మధ్య నివసిస్తూ వుంటారు. 11వ కోట ' గోమేధికము కోట'. 10వ, 11వ కోట మధ్యలో సిద్ధ వటుక బృందము, యోగినీ దేవతలు నివసిస్తూ వుంటారు. బ్రహ్మచారి, యోగినిల నాయకురాలైన 'దేవి సంకర్షిణి' పరిపాలిస్తోంది.




12వ కోట 'వజ్రమణి' కోట. ఈ ప్రదేశంలో రంభాది ఇతరులు ఆనందంతో నృత్యం చేస్తూ, లలితా పరమేశ్వరి మీద కీర్తనలు పాడుతున్నారు. ఈ ప్రదేశంలో 'వజ్ర' అనే నది ఉంది. ఇంద్రునికి అధిపతి అయిన 'వజ్రేశ్వరీ దేవి' ఈ ప్రదేశానికి క్షేత్రాధిపతి. ఈ కోటకు ఉత్తరం వైపున వుండే కోట వైడూర్యము లతో నిర్మించబడిన కోట. ఈ 12వ మరియు 13వ కోట మధ్యలో తన దనుజ పరివారముతో బలి చక్రవర్తి మరియు నాగ జాతికి చెందిన 'కర్కోటకుడు' ఇక్కడ నివసిస్తున్నారు. తదుపరిది 'ఇంద్ర నీల మణుల' కోట. ఇక్కడ 'శాతోదరీ దేవి' అనుగ్రహించిన మహాకవులు సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. తదుపరిది 'ముత్యాల కోట'. ఈ కోటల మధ్య, తూర్పున 'ఇంద్ర'; ఆగ్నేయంలో తన భార్యలు 'స్వాహా మరియు స్వధా'తో కలిసి 'అగ్ని దేవుడు' వున్నాడు. దక్షిణాన 'యముడు'; నైరుతిలో 'నిరురుతి'; పశ్చిమాన 'వరుణ దేవుడు'; వాయువ్యంలో 'వాయుదేవుడు' తన భార్యలు 'ఇడా, పింగళ మరియు సుషుమ్నా'లతో నివసిస్తూ వున్నాడు; ఉత్తరాన నిధి దేవతలు అయిన యక్షులతో కలిసి 'కుబేరుడు' మరియు ఈశాన్య భాగంలో 'కాత్యాయనీ దేవితో కలిసి ఈశ్వరుడు'. రుద్రాణితో కూడిన రుద్రదేవుడు కూడా ఉన్నాడు.

తదుపరి ప్రాకారం 'మరకతం' (పచ్చ). ఇక్కడి వృక్షములు తాటి చెట్లు, మంత్రిణీ దేవి భవనం వలె 'దండనాథ' భవనం కూడా ఎంతో అందంగా విలువైన రాళ్లతో నిర్మితమై, పంచవర్ణ చక్రంలో మహా మంత్రంలోని 110 అక్షరములతో కూడిన బంగారు కమల సింహాసనమును అధిష్టించి ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తున్నది. 'వార్తాళి' అనే మరో పేరున్న 'వారాహి దేవి' ఎర్రటి చీరను ధరించి, సిగలో చంద్ర రేఖతో భక్తుల భయాన్ని తొలగించే తల్లిగా అందరినీ అనుగ్రహిస్తున్నది. 'వార్తాళి' దేవి చుట్టూ 'స్వప్నేశి,' ఉన్మత్తభైరవి, జంభిని, భైరవి తమ తమ సేనలతో పహరా కాస్తున్నాయి. మరకతం కోటకు 7 యోజనాల దూరంలో 'పగడపు' కోట ఉన్నది. మరకతం కోటకు, పగడపు కోటకు మధ్య ఉన్న ప్రదేశాన్ని 'బ్రహ్మదేవుడు' పరిపాలిస్తున్నాడు.

తదుపరిది 'నవరత్నాల కోట'. ఈ రెండు కోటల మధ్య కెంపులతో (మాణిక్యముల) కూడిన రాజభవనం ఉన్నది, లక్ష్మీదేవి సమేత శ్రీ మహావిష్ణువు ఈ రాజభవనాన్ని పరిపాలిస్తున్నాడు. ఆ తర్వాతి స్థానంలో 'నానావిధ రత్నములతో కూడిన కోట' ఉన్నది. త్రిపుర సుందరి మాతను ఉపాసన చేస్తున్న భవానీ తో కలిసి 'భవుడు' ఈ రెండు కోటల మధ్య, 1000 స్తంభాలతో కూడిన విలువైన రత్నాల భవనమును నంది, భృంగి, సేనలతో పరిపాలిస్తున్నాడు. ఈ భవంతి నుంచి ఇప్పుడు నానావిధ రత్న కోటకు, మనోమయి కోటకు మధ్య ఉన్న ప్రదేశమును మనం చూడగలుగుతున్నాం. స్వర్ణ కమలాలు, హంసలు మొదలైన వాటితో కూడిన మహా తటాకము అయిన 'అమృత వాపి' ఇచ్చట కలదు. ముత్యాల పడవలో తారా దేవి తన

స్నేహితులతో కలిసి శ్రీ లలితా పరమేశ్వరి యొక్క  కీర్తనలను ఆలపిస్తూ ఆనందిస్తోంది. ఆమె అందాన్ని దేనితోనూ పోల్చలేం. తదుపరిది బుద్ధి కోట.

ఈ రెండు కోటల మధ్య ఒక ఆనంద వాపిక (తటాకము) కలదు, ఈ మహారాజ ప్రాసాదము లో కెంపు నౌక లో పూర్ణాయుర్ధాయమును ప్రసాదించే అమృతేశ్వరీ దేవి తన చెలికత్తెలతో కలిసి శ్రీ లలితా పరమేశ్వరి యొక్క కీర్తనలను పాడుతున్నది. ఈ బుద్ధి కోట నుండి 7 యోజనాల దూరంలో 'అహంకార కోట' ఉన్నది. ఈ బుద్ధి, అహంకార కోటల మధ్య 'విమర్శ వాపిక' ఉన్నది. సుషుమ్నా నాడికి అధిష్టాత్రి అయిన కురుకుల్లా దేవి కుంకుమ వర్ణంతో నల్ల చీర ధరించి, కెంపు నౌక లో లలితా పరమేశ్వరి యొక్క కీర్తనలు ఆలపిస్తోంది. ఆమె రూపాన్ని ధ్యానించిన వారు ఆమె సౌందర్యం వల్ల అన్నీ మరచిపోతారు. ఆ తర్వాతి స్థానంలో 'సూర్యకోట' ఉన్నది. అహంకార, సూర్య కోటల మధ్య ప్రాంతాన్ని 'ప్రకాశశక్తి, ఛాయా శక్తితో కూడిన మార్తాండ భైరవుడు' పరిపాలిస్తున్నాడు. ఆ తర్వాతి స్థానంలో 'చంద్ర కోట' ఉన్నది. సూర్య, చంద్ర కోటల మధ్య ఉన్న ప్రదేశాన్ని, నక్షత్ర సమూహాలతో కూడిన చంద్రుడు పరిపాలిస్తున్నాడు. తర్వాతి స్థానంలో 'శృంగార కోట' ఉంది. రతీ దేవి తో కలిసి మన్మథుడు ఈ రాజ్యాన్ని ఏలుతున్నాడు.

తర్వాతి స్థానంలో చింతామణి గృహమున్నది. ఈ శృంగార, చింతామణి కోటల మధ్య భాగాన్ని సూర్య భగవానుడు మహా పద్మాటవి తో పరిపాలిస్తున్నాడు. ఈ ప్రాంత అందాలను మామూలు మాటలతో చెప్పలేము. ఈ చింతామణి గృహము ముందు సూర్య, చంద్ర తేజస్సులు ఎందుకూ పనికిరావు.



చింతామణి గృహం లో శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారికి బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు ఈ ఐదుగురు కలిసి పర్యంకముగా ఏర్పడినారు. చింతామణి గృహం యొక్క దక్షిణ, పడమర మరియు ఉత్తర దిశలలో త్రిమూర్తులగు విష్ణువు, బ్రహ్మ మరియు శివుడు యొక్క రాజ భవనములు ఉన్నవి. చింతామణి గృహానికి ఆగ్నేయ దిశలో 'చిదగ్ని కుండము' ఉన్నది. చింతామణి గృహానికి నైరుతి దిశలో ఒక చక్ర రథం ఉన్నది. అది 100 యోజన కొలతలతో తొమ్మిది మెట్లతో విలువైన రాళ్లతో తయారు చేయబడినది. అదే దిశ లో 'బాలాంబకు' కూడా మరో బంగారు రథం ఉన్నది. చింతామణి గృహానికి వాయువ దిశలో 'శ్యామలాదేవి'కి 7 ఆవరణములతో కూడిన 'గేయ' చక్రమనే రథము, ఈశాన్యంలో 'వారాహి దేవి' కి 5 ఆవరణములతో కూడిన 'కిరి' చక్రమనే రథము ఉన్నవి.

దక్షిణ భాగంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతములలో చింతామణి గృహం చుట్టూ 'మాతంగి, మంత్రిణీ, వారి సేనల కోసం రాజభవనములు ఉన్నాయి. ఈ చింతామణి గృహం చుట్టు పరమేశ్వరి మాత సేవకులుగా  చాలా మంది దేవతలు ఉన్నారు. చింతామణి గృహ మధ్య భాగంలో 'బిందువు' అని పిలువబడే స్థానం లో  శ్రీచక్రం ఉన్నది. శ్రీచక్రం లోని మొదటి వృత్తంలో 'అణిమాది అష్ట సిద్ధి దేవతలు' ఉన్నారు. రెండవ వృత్తంలో బ్రాహ్మీ మొదలగు 'మాతృకా దేవతలు ఉన్నారు. మూడవ వృత్తంలో  'సర్వ సంక్షోభిని' వంటి పది ముద్రా దేవతలు వున్నారు; శ్రీచక్రము లోని త్రైలోక్య మోహన చక్రంలో త్రిపురా దేవి కలదు.

శ్రీచక్రం లోని తర్వాతి అంతస్తు లో 'కామాకర్షిణీ' మొదలగు దేవతలు ఉన్నారు; ఆ పై అంతస్తు లో సర్వాశాపరి పూరక చక్రములో గుప్త యోగిని దేవతలు, త్రిపురేశ్వరి దేవతను  పూజిస్తున్నారు. శ్రీచక్రం లోని తరువాతి అంతస్తు లో  'అనంగ

కుసుమ’ మొదలగు దేవతలు ఉన్నారు.  సర్వ సంక్షోభణ చక్రములో గుప్తతర యోగిని దేవతల చేత త్రిపుర సుందరి దేవత ఆరాధించ బడుచున్నది. తదుపరి సర్వ సౌభాగ్యదాయక చక్రములో 'శ్రీ త్రిపురవాసిని' తో పాటు సర్వ సంక్షోభిణి దేవతలు ఉన్నారు. 'సర్వార్ధసాధక చక్రం'లో 'త్రిపురాశ్రీ'తో దేవత తో పాటు సర్వ సిద్ధిప్రదాదేవి లలితా పరమేశ్వరి అమ్మవారికి సేవ చేస్తున్నారు.

'శ్రీ త్రిపురమాలిని' దేవత తన సమస్త రక్షక దేవతలతో, నిగర్భ యోగిని దేవత తో కలిసి లలితా పరమేశ్వరి మాత యొక్క ఆజ్ఞను అమలు చేయడానికి సర్వ రక్షాకర చక్రములో సిద్ధమైంది. శ్రీచక్రం యొక్క తర్వాతి స్థానం లో  'రహస్య యోగిని' దేవత తో పాటు 'వశినీ' మొదలగు వాగ్దేవతలు సర్వరోగహర చక్రంలో త్రిపురా సిద్ధాంట ఆధీనం లో వుంటారు. 'మహా పీఠం'లో వశినీ దేవి స్థానం పైన, శత్రువులను నాశనం చేసే ఆది దంపతుల యొక్క ఆయుధాలు శ్రీచక్రం లో ఉన్నాయి. ఈ ఆయుధ భాండాగారము పైన సర్వసిద్ధిప్రద చక్రంలో శ్రీ త్రిపురాంబ దేవి తో పాటు 'కామేశ్వరి' దేవతలు ఉన్నారు.

'కామేశ్వరి' గృహమునకు పైన, 'మిత్రేశమయి’ వంటి గురు స్వరూపముల గృహములు శ్రీ చక్రంలో కలవు.  ఈ గృహమునకు పైన అనేక విలువైన రాళ్ల తో అలంకరించిన గృహములు  నిత్యా దేవతలు అయిన 'కామేశ్వరి, భగమాలిని' కి కలవు. శ్రీచక్రం లోని 'నిత్యాదేవి' గృహానికి పైన షడంగ దేవతల యొక్క గృహములు వున్నవి. దీనికి పైన 'సర్వానందమయ' చక్రంలోని 'బిందువు'లో పంచ బ్రహ్మ రూపము లతో కూడిన మంచము, మంచములో అమూల్యమైన విలువైన రాళ్ళున్నాయి. మంచం చుట్టూ నల్లటి  యవనిక (పరదా) ఉన్నది మరియు ఇది మంచాన్ని అన్ని దిశల నుండి కప్పివేస్తున్నది.



మధుర సువాసనలు వెదజల్లే వివిధ రకముల అందమైన పుష్పములు మంచం పై నుంచి వేలాడుతూ ఉన్నాయి. మంచానికి నాలుగు కాళ్ళు గా బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వరుడు వున్నారు. ఆగ్నేయంలో అగ్నిదేవుడు, నైరుతిలో నిరుతి, పడక అడుగు భాగమున  వాయు దేవుడు. సదాశివుడు మంచానికి వేదికగా (బల్లగా) వున్నారు. విలువైన రాళ్లతో అలంకరించిన కొన్ని బంగారు మెట్లు, వాటి పైన వివిధ రంగుల కలయికలతో నాలుగు దిండులు మంచంలో కలవు. ఆమె మరెవరో కాదు నిత్య యవ్వనంతో ఎప్పుడూ ఆకర్షణీయంగా,  అందంగా ఉండే శ్రీ లలితా పరమేశ్వరి తన భర్త కామేశ్వరుని ఒడిలో కూర్చొని వున్నది. ఎర్రటి సింధూరపు రంగు చీరను ధరించి, నుదుటి పై రెండు కనుబొమ్మల మధ్య సింధూరం ధరించి వున్నది, అది మన్మథుడి విల్లును మరచిపోయేలా చేస్తున్నది. నిండు పున్నమిని తలపింపజేసే ముఖారవిందము తో, ఎర్రటి పెదవులతో, తామర రేకుల్లాంటి కళ్ళతో, అందమైన చిరునవ్వుతో కూడిన బుగ్గలతో,  మెరిసే చెవి కమ్మల  ప్రతిబింబంతో ఉన్న ఆమెను  ఈ ప్రపంచము లో దేనితోనూ పోల్చలేము. ఆమె తన కిరీటంలో చంద్రుని ధరించి, కొప్పులో వివిధ సువాసనలతో కూడిన పువ్వులను ధరించి, భుజం మీద నిలువెత్తు పొడుగున ధరించిన దండ ఆమె భర్త కామేశ్వరుడిని సదా తనతోనే ఉండేలా చేస్తున్నది.

ఆమె నాలుగు చేతులలో పాశము, అంకుశము, చెరకు విల్లు, ఐదు బాణాలు ఉన్నాయి.  ఆమె ధరించిన ఆభరణాలు చాలా విలువైనవి మరియు ఆమె శరీర భాగాలకు సరిగ్గా అతికినట్లుగా సరిపోయినాయి. ముత్యాల హారము, గాజులు, ఉంగరాలు, భుజ ఉంగరాలు, వడ్డాణము, ముక్కు కమ్మలు, బుల్లాకీలు మరియు ఆమె కాళ్ళలోని ఆభరణాలు గజ్జలు మొదలైనవి అందాన్ని మరింత అందంగా మారుస్తున్నాయి. బ్రహ్మ, విష్ణువు మరియు ఇతర దేవతలు  పరమేశ్వరి మాత యొక్క పాద

పద్మాలకు తమ కిరీటాలతో తలలు వంచి నమస్కరించినప్పుడు ఆ కిరీటంలోని విలువైన రాళ్ళు పడి ఆమె పాద పద్మములు ఇంకా మెరుస్తున్నాయి.




చిన్న కీటకము దగ్గర్నుంచి హిరణ్యగర్భుడైన బ్రహ్మదేవుని వరకు ఈ ప్రపంచము లో ప్రతి ఒక్కరికీ ఆమె తల్లి. దేవీ పూజ చేస్తున్న వారికి, ఆమె గురించి, ఆమె అందం గురించి, ఆమె ఆభరణాలు గురించి చెప్పడానికి మాటలు వుండవు. ఆమె మహిమను చదివేవాళ్లు, వినేవాళ్లు ఎంతో పుణ్యాత్ములు. వారు తమ మునుపటి జన్మ పుణ్య కర్మ కారణంగా దీనిని చేయగలుగుతారు. జగన్మాత పాద పద్మములకు పదే పదే నమస్కారములు చేయడం ద్వారా అది ఆమె భర్త కామేశ్వరుడ్ని ఎల్లవేళలా సంతోషపెట్టే చర్య అని మరియు శ్రీ చక్ర పూజ చేసేవారికి, ప్రతి రోజు ఈ శ్లోకము చదివే వారికి, ఆమెనే సదా ధ్యానిస్తూ వుండే వారికి అసాధ్యమైనది ఏదీ లేదని ఈ శ్లోకాన్ని రచించిన దుర్వాస మహర్షి చెప్పినారు.

ఈ శ్రీ చక్ర పూజను గురువు నుండి సరైన మార్గంలో, పరంపర లో ఉపదేశము పొందాలి. ఈ శ్రీ చక్రాన్ని బంగారం, వెండి, పంచ లోహ, స్పటిక, ఫలకాల మీద సరైన దేవి ఉపాసకుల చేత చెక్కబడిన యంత్రముల మీద పూజ చేయవచ్చును లేదా పసుపు పొడిలో గీసి పూజ చేయవచ్చును. ఈ యంత్ర పూజ వలన మనకు కలిగే ప్రయోజనాలను మాటల్లో వర్ణించలేము. సర్వం శ్రీ గురు చరణార విందార్పణమస్తు. సంపూర్ణం.

తెలుగు అనువాదము, రచన - శ్రీ భాస్కరానంద నాథ Source: Voice of Jagadguru Navratri Special edition, Sep.2022

Our Mail ID: Info@voiceofjagadguru.com


| Editorial Board | | |
|---|---|---|
| Sri Dr V R Gowri Shankar | Hon' Advisor | Administrator & CEO, Sri Sringeri Mutt & It's Properties, Sringeri |
| Sri S N Krishnamurthy | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| Sri Tangirala Shiva Kumara Sharma | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| B Srimathi Veeramani | Chief Editor | Tirunelveli |
| K M Kasiviswanathan | Hon' Editor | Tirunelveli |
| Sri Bhaskarananda Natha | Writer/Translator | Nellore |